క్లుప్తంగా

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవర అనంతరం రెండో ఆదివారం కావడంతో వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు 16 రోజుల పండుగ

మూలపెద్దమ్మ దేవరను ఈనెల 8, 9,10 తేదీల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీంతో చివరిగా 23న మంగళవారం 16 రోజుల పండుగను నిర్వహించనున్నారు. దీంతో పెద్దమ్మ దేవర పూర్తవుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి వారం భక్తులు యథావిధిగా మొక్కులు చెల్లించుకోవచ్చన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కార్డెన్ సెర్చ్‌లో భాగంగా పోలీసులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రమోద్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అహోబిలం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని ఐదు మోటారు బైక్‌లను సీజ్ చేయడంతో పాటు ఇద్దరు వ్యక్తుల నుంచి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. పవిత్రమైన అహోబిలం క్షేత్రంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సీఐలు దస్తగిరిబాబు, మురళీధర్‌రెడ్డి, దొర్నిపాడు, చాగలమర్రి, శిరివెళ్ల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

26న జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా అధికారి, ప్రిన్సిపాల్

నందికొట్కూరు: ఈ నెల 26న నిరుద్యోగుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీ. శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సునీతతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 10 ప్రైవేట్ కంపెనీలు వస్తాయని చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీ.టెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం 91548 30286, 76739 02328 గల సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలి



రంగులు వేస్తున్న దృశ్యం

మహానంది: దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి హిందువు తన వంతు కృషి చేయాలని రాష్ట్రీయ ధర్మరక్షా దళ్ జిల్లా అధ్యక్షుడు నవీన్ గౌడ్ అన్నారు. బొల్లవరంలోని గోమాత సమాధి (దేవాలయం) పరిసరాలను ఆర్‌డీడీ, మన నేస్తం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు పదేళ్ల క్రితం గ్రామంలోని దేవుని గోదవు మృతి చెందితే సమాధి కట్టించడం హర్షణీయమన్నారు. గోమాత దేవాలయాన్ని శుభ్రం చేసి, రంగులు వేశామన్నారు. కార్యక్రమంలో గోరక్షక్ విభాగ్ జిల్లా ప్రముఖ్ రామచరణ్, నంద్యాల, మహానంది మండలాల అధ్యక్షులు సతీష్, నాగరాజు, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తాడి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

బడి బస్సులు భద్రమేనా!

- నిబంధనలు పాటించని విద్యా సంస్థలు
- ఫిట్‌నెస్ లేకున్నా రోడ్లపైకి బస్సులు
- దృష్టి సారించిన అధికారులు
- జిల్లాలో పాఠశాలల బస్సులు 598
- ప్రారంభమైన ఫిట్‌నెస్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. ఇంటికి సుదూరంగా ఉన్నా పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు మంచి పాఠశాలలను ఎంచుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో వారిని డ్రాప్ చేయడం, పికప్ చేసుకోవడం వంటి వెసులుబాటు అందరికీ లేకపోవడంతో పలువురు స్కూల్ బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు, ఫీజు వసూళ్లపై చూపిస్తున్న శ్రద్ధ బడి బస్సులపై చూపడం లేదు. కొన్ని విద్యా సంస్థలు పాత వాహనాలకు కొత్తగా రంగులద్ది రోడ్లపై యథేచ్ఛగా తిప్పుతున్నాయి. తక్కువ వేతనానికి పనిచేసే ఎలాంటి అనుభవం, అర్హత లేని డ్రైవర్లను నియమించుకుని పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ఆర్టీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో వివిధ రకాల ప్రైవేటు విద్యాసంస్థలు 526 వరకు ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల విద్యార్థులు అధిక శాతం బస్సుల్లోనే ప్రయాణం చేస్తుంటారు. అయితే, బస్సు సామర్థ్యం సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందుకే ఏటా ఎంవీఐలు బస్సు కండీషన్ చెక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంటారు. గత ఏడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ముగియడంతో ఈనెల 17వ తేదీ నుంచి జిల్లాలో కొత్తగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది.



నంద్యాలలో ప్రైవేటు స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఆర్టీఓ అధికారులు

ఎఫ్‌సీ లేకుంటే సీజ్ చేస్తాం

స్కూల్ యాజమాన్యం తమ బస్సుకు సంబంధించి ఖచ్చితంగా ఆర్టీఓ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) పొందాలి. ప్రభుత్వ అనుమతులు లేకుండా వాహనం రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎటువంటి నిబంధనలు పాటించకపోయినా బస్సులు సీజ్ చేయటంతో పాటు, కేసులు నమోదు చేస్తాం. బస్సులకు అన్ని పరీక్షలు పూర్తి చేసుకోవాలి. గడువు ముగిసిన తర్వాత ఎఫ్‌సీ, పర్మిట్, కండీషన్ లేని బస్సులను సీజ్ చేస్తాం.మే నెల నుంచే విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

–ఐశ్వర్యారెడ్డి, డీటీఓ, నంద్యాల

నిబంధనలు ఇలా..

- స్కూల్ బస్సు డ్రైవర్‌కు 60 సంవత్సరాలు వయో పరిమితి దాటిన వ్యక్తి అనర్హుడు.
- డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు ఆయా యాజమాన్యాలు విధిగా చేయించి, ఆ రికార్డులను భద్రపరచాలి.
- డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు తెలియజేయటంతో పాటు, 5 సంవత్సరాల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- కళాశాల, స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లి దండ్రులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయటంతో పాటు, ప్రతి నెలా వాహనానికి సంబంధించి స్థితిగతులను రిజిస్టర్ చేయటంతో పాటు, ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని ఉంచాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అగ్నిమాపక పరికరం, బ్యాగుల భద్రపరుచుకునే బాక్సులు సబ్‌రూల్ ఏ, బీ ప్రకారం ఉండాలి.
- ప్రతి బస్సులో ఒక అటెండర్ ఉండాలి. వాహనంలో ప్రయాణించే విద్యార్థుల వివరాలను విద్యాసంస్థల యాజమాన్యాలు నోట్ చేసుకోవడంతో పాటు, తల్లిదండ్రులకు బస్సు డ్రైవర్ వివరాలు తెలియజేయాలి.

ఆన్‌లైన్ తేదీల ఖరారు..

జిల్లాలోని స్కూళ్లు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు చేపట్టడానికి నంద్యాలలోని రవాణా శాఖ కార్యాలయం సన్నద్ధమైంది. వాహనాలు ఎలా ఉండాలనే విషయంపై పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఇప్పటికే తెలియజేశారు. వాహనం ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో పాఠశాల/కళాశాల యాజమాన్యాలు ఈ ప్రగతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం రవాణా శాఖ కార్యాలయానికి ఎఫ్‌సీ చేయించుకునేందుకు ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తెస్తే అందరి సమక్షంలో వాహన ఫిట్‌నెస్‌ను తనిఖీ చేస్తారు.

జిల్లాలో 598కు పైగా బస్సులు..

జిల్లాలో ఆర్టీఓ అధికారులు గణాంకాల ప్రకారం 598కు పైగా పాఠశాల, కళాశాలల బస్సులు ఉన్నాయి. రూల్ నెంబర్ 185 (ఎఫ్) ప్రకారం ఖచ్చితంగా ప్రతి స్కూల్, కళాశాలల యాజమాన్యాలు పాటించాల్సిన నిబంధనలు ఉన్నాయి. దానిలో భాగంగా ముఖ్యంగా వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పని సరిగా ఉండాలి. ఆర్టీఓ అధికారులు పూర్తి స్థాయిలో అన్ని తనిఖీలు నిర్వహించిన తర్వాతే బస్సు రోడ్డెక్కేందుకు అనుమతులు ఇస్తారు.

బొల్లవరంలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: గ్రామాల్లో ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమని మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బొల్లవరం గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు అనుమానితుల ఇళ్లల్లో చేసినట్లు చెప్పారు. చెడు నడత కలిగిన, నేర చరిత్ర ఉన్న వారి ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా పాల్పడుతుంటే సమచారం ఇవ్వాలని, వారి గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పూదోట లింగావధూతస్వామి ఆరాధన

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న పూదోట లింగావధూతస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం పంచామృతాభిషేకం, అష్టోత్తర శత దీప సమాయుక్త నివేదనలు, రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు. బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దొంతా వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పల్లె నాగేశ్వరరెడ్డి, సంజీవ రాయుడు, శ్రీరాములు, వజ్రం క్రిష్టారెడ్డి, రామసుబ్బయ్య, వీరన్న పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

ఉయ్యాలవాడ : చదువుతోనే కుటుంబం అభివృద్ధి చెందుతుందని నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అల్లూరు గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చల్లా వెంకటరెడ్డి పదవి విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించా రు. ఎంఈఓ రఘురామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ అతిథిగా హాజరై చల్లా వెంకట కొండారెడ్డి దంపతులను శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించారు. అనంతరం పోచా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని చెప్పారు. భావి పౌరులను తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎనలేనిదన్నారు. సన్మాన గ్రహీత కొండారెడ్డి తాను పని చేసిన పాఠశాలలో మొక్కల పెంపకం కోసం రూ. 1లక్ష విరాళం ప్రకటించారు. జెడ్పీటీసీ కసాని పుణ్య లక్ష్మీదేవి, మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, కోవెలకుంట్ల ఎంఈఓ వెంకటసుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, విశ్రాంత ఎంఈఓలు నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, బీసీఎస్సార్ కరెస్పాండెంట్ బుడ్డా విశ్వనాథరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, న్యాయవాది ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, పలువురు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, కూడాల నారాయణరెడ్డి, ఆరికట్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చల్లా వెంకట కొండారెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎంపీ పోచా, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



నందమూరినగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని నందమూరినగర్‌లో శాఖ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ హాజరై మాట్లాడుతూ చాలీచాలని ఇళ్లలో రెండు మూడు కుటుంబాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నందమూరినగర్ శాఖ కార్యదర్శిగా హుసేన్‌సా, సహాయ కార్యదర్శిగా ఓబులేసునాయక్‌తో పాటు 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు కోరారు. విగ్రహ ఏర్పాటులో అధికారులు చేస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అంబేడ్కర్ విగ్రహానికి ముసుగు వేసి బొమ్మల సత్రం వద్ద రెండో విగ్రహం పెట్టారన్నారు. పలు మార్లు పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించలేదన్నారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామంటూ మూడు మాసాల క్రితం తెలిపిన అధికారులు ఇంత వరకు దాని గురించి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, నాయకులు రవిబాబు, సలాం, సలీం, అంజి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతలమోహన్‌రావు

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన చలివిపిండి తయారు చేసి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. అధికారులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కోనేరులో భక్తుల స్నానాలు

మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఉదయం స్థానిక అలంకార మండపంలో శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు కల్యాణోత్సవం పూజలు వైభవంగా జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు

ఆత్మకూరు: పట్టణ శివారులో ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు.. పట్టణ సమీపంలోని ఉర్దూ పాఠశాల వద్ద బొలెరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆత్మకూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న, నంద్యాల నుంచి ఆత్మకూరుకు వస్తున్న వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బొలెరో వాహనం, ఆటో ముందుభాగాలు దెబ్బతిన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గోస్పాడు: రేవనూరు గ్రామానికి చెందిన ఠాగూర్ (22) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యువకుడికి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెంది మండల కేంద్రమైన గోస్పాడు సమీపంలో శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. ఈమేరకు తల్లి మరియమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఘనంగా గజ్జల పూజ

ప్యాపిలి: మండల పరిధిలోని కొమ్మేమర్రి గ్రామంలో ఆదివారం గజ్జల పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోలాటం నేర్చుకున్న బాలబాలికలు, యువత తాము నేర్చుకున్న కళను గురువుకు, జాతికి అంకితం చేసేందుకు గజ్జల పూజను నిర్వహిస్తారు. కొమ్మేమర్రి గ్రామంలో కొద్ది రోజులుగా కోలాటం మాస్టర్ కేవీ మధు కోలాటంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని గజ్జల పూజలో భాగంగా మధును శిష్యబృందం సభ్యులు సత్కరించారు. రామాయణం, భారతం, జానపద గీతాలు, సినీ గీతాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం అలరించింది. కార్యక్రమాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

దైవారాధనతో మోక్షం



ప్రసంగిస్తున్న చరణానంద భారతిస్వామి

బేతంచెర్ల: భగవంతుని ఆరాధనతో మోక్షం సిద్ధిస్తుందని రాజాశ్రమ పీఠాధిపతులు క్రిష్ణ చరణానంద భారతి స్వామి, చైతన్య మాతాజీ అన్నారు. ఆదివారం పట్టణంలో పూదోట లింగావధూతస్వామి వారి ఆరాధన ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగం వినిపించారు. పితృవాక్య పరిపాలకుడిగా రాముడు, మాతృవాక్య పరిపాలకులుగా పాండవులు నిలిచారన్నారు. అందుకు నిదర్శనంగా పాండవులు శరీరకంగా కష్టాల పాలైనా ఆత్మ సంబంధంగా మోక్షాన్ని పొందారని తెలిపారు. రాగ ద్వేషాలకు దూరంగా ఉంటే భగవంతుని చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్, చంద్రమౌళి, భజన కృష్ణయ్య పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

విదేశాల్లో భారతీయులకు ప్రత్యేక గుర్తింపు

ఉయ్యాలవాడ: నరేంద్రమోదీ దేశ ప్రధానమంత్రి అయిన తరువాత విదేశాల్లో భారతీయులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు విదేశాల్లో భారతీయులంటే చిన్న చూపు చూసేవారన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారానే కొనసాగుతుందన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచానికి మన దేశ శక్తిని నరేంద్రమోదీ చూపించారన్నారు. దేశం అభివృద్ధిలో రహదారులు, రైల్వేలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సభ్యులు సీతారాముడు, గౌరవాధ్యక్షుడు సలిపెల రాజగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీరామ్, మండల బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు జింకా వెంకటస్వామి, కోశాధికారి అర్జిగారి నరసింహులు, ఆలయ మాజీ ధర్మకర్త ఖాతా దస్తగిరిరెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో సమావేశంలో మాట్లాడుతున్న బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి

ఎమ్మెల్యే రాజసింగ్ అరెస్ట్ హేయం



సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): తెలంగాణలోని బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ అరెస్ట్ హేయమైన చర్యగా విశ్వహిందూ పరిషత్ నాయకులు రాంప్రసాద్, బీజేపీ నాయకుడు కృష్ణమూర్తి, ఆలయ చైర్మన్ అరవేటి వాసు అభివర్ణించారు. ఆదివారం స్థానిక శ్రీకాళికాంబా ఆలయంలో శ్రీకాళిమాత సేవాసమాజ్ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలను అడ్డుకున్నందుకు ఎమ్మెల్యే రాజసింగ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. కార్యక్రమంలో కాళీమాత సేవాసమాజ్ సభ్యులు విజయకుమార్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, అలవాల సత్యనారాయణ, రామాంజనేయులు, రమేష్, నరసింహ, విశ్వహిందూ సభ్యులు పాల్గొన్నారు.

రవికృష్ణ సేవలు వెలకట్టలేనివి



డాక్టర్ రవికృష్ణకు ఆత్మీయ సత్కారం చేస్తున్న నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): డాక్టర్ రవికృష్ణ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ సహదేవుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ క్లబ్ సంస్థల మాజీ చైర్మన్, ఏవీఆర్ ప్రసాద్, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు భవనాసి నాగ మహేష్ కొనియాడారు. స్థానిక మధుమణి సమావేశ భవనంలో ఆదివారం లయన్స్ క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణకు సభ్యులు సత్కరించి మాట్లాడారు. రవికృష్ణ గత 30 సంవత్సరాలుగా వైద్యుడిగా విశిష్ట సేవలు అందించడమే కాకుండా కళారాధన ద్వారా కళా సాంస్కృతిక సేవలు, లయన్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవలు, దివ్యాంగుల సంక్షేమ సంఘం ద్వారా దివ్యాంగుల సేవలు, ఐఎంఏ ద్వారా వైద్య శిబిరాలు, పలు క్రీడా సంఘాల ద్వారా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సేవలను మెచ్చి డాక్టర్ రవికృష్ణకు ఉగాది పురస్కారం, కళారత్న, హంస పురస్కారాలు సర్కారు అందించినట్లు చెప్పారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, జోన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, గురు రాజా స్కూల్ డైరెక్టర్ షావలి రెడ్డి, బవిరిసెట్టి శ్రీకాంత్, కొశెట్టి చంద్రశేఖర్, కొసెట్టి వేణు మాధవ్, రవిప్రకాష్, ఆంజనేయులు గుప్తా, బైసాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మహానంది ఆలయ పరిసరాల్లో నల్లటి మేఘాలు

ఊరిస్తున్న మేఘాలు!

మహానంది: ఇటీవల వరుణుడు కరుణ లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మండలంలో ఇప్పటికే అరటి, పసుపు, పొగాకు, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేశారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో పంటల సాగు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మహానంది ఆలయం వద్ద ఆదివారం ఆకాశంలో నల్లటి మేఘాలు ఆవరించిన దృశ్యాన్ని సాక్షి కెమెరాలో బంధించింది.